క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి



మాట్లాడుతున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం నుంచి రిలీవైన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని వైస్‌చాన్స్‌లర్ కె.ఆర్.రజిని ఆకాంక్షించారు. వర్సిటీ సెమినార్ హాల్లో గురువారం ప్రత్యేక బీఎడ్ కోర్సు విద్యార్థులతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆదర్శవంతమైన సమాజం నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. వర్సిటీ విద్యార్థులు ఉన్నస్థాయిలో ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, కోర్స్ కోఆర్డినేటర్ హెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే



ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కె.వి.మహేశ్వరరెడ్డిని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పలు అంశాలపై చర్చించారు.

నేత్రపర్వంగా జగన్నాథుని మారు రథయాత్ర



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలోని గుడిసెనగుళ్ల పది రోజులుగా జరిగిన జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవం గురువారం తిరువీధితో ముగిసింది. మారు రథయాత్ర నిర్వహించి పూజలు ముగించారు. సుభద్ర, బలభద్రల సమేత జగన్నాథస్వామి మూర్తులకు పెంట సోదరులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి ఊరేగింపుగా ప్రధాన ఆలయానికి చేర్చారు.

నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నిక



మహాలక్ష్మి నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు

రణస్థలం: నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి సంఘం తరపున కృషి చేస్తామని శ్రీమహాలక్ష్మి నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. రణస్థలంలో మండల స్థాయి నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నిక గురువారం నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి నాయీబ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్‌గా కోణమంచిలి రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా కాలుకూరు లక్ష్మణరావు, సెక్రటరీగా కలపర్తి అప్పలకొండ, జాయింట్ సెక్రటరీగా ఇనపకుర్తి అప్పారావు, కోశాధికారిగా కాపరపు శ్రీను, జయింట్ కోశాధికారిగా కోణమంచిలి శ్రీనును ఎన్నుకోవడం జరిగిందని సంఘ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట కూడలిలోని కొయ్యరాళ్ల సమీపంలో గల జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. చిలకపాలెం వైపు వెళ్తున్న ఆటోను ఎచ్చెర్ల గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడు బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. అశోక్ హెల్మెట్ ధరించకపోవటంతో తలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఎచ్చెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ల సందర్శన

శ్రీకాకుళం క్రైమ్, శ్రీకాకుళం రూరల్: జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి నగరంలోని ఒకటో పట్టణ, పెద్దపాడు సమీపంలోని రూరల్ పోలీస్ స్టేషన్లను గురువారం రాత్రి వర్షంలోనే వెళ్లి ఆకస్మికంగా సందర్శించారు. ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా రెండు స్టేషన్లను సందర్శించడంతో సీఐ లెంక సన్యాసినాయుడు, ఎస్ఐలు కామేశ్వరరావు, కృష్ణారావు, వాసుదేవరావులు తమ సిబ్బందితో సాదరంగా ఆహ్వానించారు. పలు రికార్డులను పరిశీలించారు. పలు కేసుల ప్రగతిపై ఆరా తీశారు. సీఐ, ఎస్ఐలతో ఎస్పీ మాట్లాడుతూ.. విజిబుల్ పోలీసింగ్, నగరంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బాలికలు, యువతులపై విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ఈవిటీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు.

ప్రయాణం.. ప్రమాదం!

- రోడ్లపైనే ఆవులు, గేదెలు
- పాలుపిండి విచ్చల విడిగా వదిలేస్తున్న యజమానులు
- అధికారుల హెచ్చరికలు భేఖాతర్



పీఎన్‌కాలనీ ప్రధాన రోడ్డులో రాత్రి వేళ ఉన్న ఆవులు



రిమ్స్‌రోడ్డులో వెళ్తున్న గేదెలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఒకపక్క పెరుగుతున్న వాహనాలతో ప్రజలు అవస్థలు పడుతుండగా.. మరోపక్క విచ్చల విడిగా సంచరిస్తున్న ఆవులు, గేదెలతో మరిన్ని ఇక్కట్లు పడుతున్నారు. పాడిపశువుల ఆలనా, పాలనా సక్రమంగా చూసుకోవాల్సిన యజమానులు రెండు పూటలా పాలు పితుక్కొని ఆ తరువాత నిర్లక్ష్యంగా రోడ్లపై విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. రాత్రి, పగలూ తేడా లేకుండా రోడ్ల మధ్య తిరగడం, గుంపులుగా పడుకుని ఉంటుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలామంది ప్రమాదాల బారినపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు పాఠశాలలకు, ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లి వచ్చే సమయాల్లో గేదెలు, ఆవులు రోడ్లపై గుంపులుగా ఉంటుండడంతో ఇబ్బంది పడుతున్నారు. సైకిళ్లపై వచ్చే పిల్లలు వీటి కారణంగా ప్రమాదలకు తరచూ గురువుతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై రాత్రి వేళల్లో వెళ్లేవారు రోడ్డుకు అడ్డంగా పడుకొని ఉంటున్న పశువులను గమనించకపోవడంతో వాటిని ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. పశువులు కూడా గాయపడడం, చనిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆవులులు, గేదెలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్న వాటి యజమానులకు ఇప్పటికే పలుమార్లు నగర పాలక సంస్థ కమిషనర్, ఇతర అధికారులు హెచ్చరించినప్పటికీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడిగా రోడ్లపై సంచరిస్తున్న పశువుల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విచ్చలవిడిగా తిరుగుతున్నాయి



పశువులను రోడ్లపై విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. రిమ్స్ ఆస్పత్రి రోడ్డులో నిరంతరం రోగులతో ఉండే అంబులెన్సులు తిరుగుతుంటాయి. పశువులు రోడ్డుపై అడ్డంగా ఉంటుండడంతో రోగులు సైతం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్య తీసుకోవాలి.

– కె.సంజీవరావు, రిమ్స్ ఆస్పత్రి రోడ్డు, శ్రీకాకుళం

తరచూ ప్రమాదాలు



కలెక్టర్, జిల్లా పరిషత్, పొన్నాడ గ్రామానికి వెళ్లే వారంతా పశువుల కారణంగా అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యలో ఆవులు నిత్యం ఉంటుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకున్నవారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి పశు యజమానులపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

– కర్రి రంగాజీదేవ్, కలెక్టర్‌బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం

అడవుల్లోకి తరలిస్తాం..



రోడ్లపై విచ్చలవిడిగా వదిలేస్తున్న పశువుల విషయమై ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సంబంధిత యజమానులను హెచ్చరించినా వారి తీరులో మార్పులేదు. పశువులలను పాకల్లో కట్టుకోవాల్సి ఉన్నప్పటికీ అలా చేయడం లేదు. వీరిలో మార్పురాకపోతే రెండు రోజుల్లో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను స్వాధీనం చేసుకొని సీతంపేట అడవులకు తరలిస్తాం.

–చల్ల ఓబులేసు, నగర పాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

విత్తన బంతుల తయారీపై శిక్షణ



సీడ్ బాల్స్ తయారీలో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు జూన్ ఐదు నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు చేపడుతున్న మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం ఇన్‌స్పైర్ స్కూల్ విద్యార్థులకు విత్తన బంతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతలపై విద్యార్థి దశ తెలియచేయాలనే ఉద్దేశంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీడ్ బాల్స్ తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ విభాగం కోఆర్డినేటర్ దార్లపూడి రవి తెలిపారు. మొక్కల పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలో శిక్షణలో పాల్గొన్న 150 మంది పిల్లలకు అవగాహన కల్పించారు. స్కూల్ కరెస్పాండెంట్ అనంతరావు, రోటరీ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివసరావు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సాయికుమార్

రణస్థలం: కొండములగాం ఆదర్శ పాఠశాలలోని 20 మంది పదో విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం మండలానికే గర్వకారణమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను గురువారం సత్కరించారు. విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో రణస్థలం ఆదర్శ పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే రణస్థలం మండలంలో అన్ని తరహా విద్యా సంస్థలు ఉన్నాయని, ఇటువంటి విజయాలతో మరింతగా విద్యారంగంలో రణస్థలం రాణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, పార్టీ నాయకులు గొర్లె అప్పలనాయుడు, రెడ్డి వాసు, టేకి బ్రహ్మాజీ, ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న జిల్లా చెస్ ఎంపిక పోటీలు



చెస్ సాధనలో చిన్నారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-11 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈ నెల 21న జరగనున్నాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ గురువారం తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలో ఉన్న చెస్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ ప్రారంభమౌతుందని చెప్పారు. 2013 జనవరి ఒకటి తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని స్పష్టంచేశారు. ఎంపికైన వారు ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి అండర్-11 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతోపాటు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి ఎంపికల్లో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 74168 64642 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ, విశ్వమానవ శ్రేయస్సుకు నడక సంఘాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని అంతర్జాతీయ నడక సంఘాల ప్రతినిధులు చెలికాన సీతారామయ్య, శీలం ఇసాక్, ఎస్వీ రవీంద్ర, అభిమన్యు నాయక్‌లు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విధిగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, ప్రతినిధులు బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, జి.ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

డ్యాన్స్ క్లబ్ ఏర్పాటు

స్థానిక పి.ఎస్.ఎన్.ఎం.స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్యా వాకింగ్ అండ్ జుంబా డ్యాన్స్ క్లబ్‌ను అంతర్జాతీయ వాకింగ్ సంఘం ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. క్లబ్ నూతన కార్యవర్గ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వ్యవస్థాపక అధ్యక్షునిగా బి.దేవీప్రసాద్, అధ్యక్షుడుగా కింతలి సాయికృష్ణ, కార్యదర్శిగా బి.గారయ్య, కోశాధికారిగా బి.రామకృష్ణ, ఉపాధ్యక్షునిగా ఎన్.పండా, జాయింట్ సెక్రటరీలుగా నిశా బేగం, బి.సౌజన్య, జోలీ, వాకరుగా శ్రీరామ్‌లు ఎంపికయ్యారు. వీరితో క్లబ్ గవర్నర్ జామి నారాయణ స్వామి ప్రమాణ స్వీకారం చేయించారు.

24న కొబ్బరి చెక్కల వేలం

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీ సమీపంలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు పొందేందుకు ఈనెల 24న మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో శ్యామలరావు తెలిపారు. ఆగస్టు 024 నుంచి జూలై 2026 వరకు రెండేళ్ల అనుమితి కోసం నిర్వహించే వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ. రెండు వేలు ధరవత్తుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఆలయ పరిధిలో స్వామివారి ఫొటోలు, పుస్తకాలు, లడ్డూ, పులిహోరా, పటిక బెల్లం విక్రయం కోసం కూడా అదే రోజున వేలం నిర్వహిస్తామన్నారు.

పరామర్శ..



సురేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని రణస్థలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపురెడ్డి సురేష్‌కు ఇటీవల కాలుకు తీవ్రగాయం కావడంతో చికిత్స పొందున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి లక్ష్మణనాయుడు, మహంతి జోగినాయుడు, గురునాయుడు, చందక వెంకటరమణ తదితరులు ఉన్నారు.

20న బాలల హక్కు పరిరక్షణ కమిషన్ చైర్మన్ పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళగిరి కమిషన్ కార్యాలయ కార్యదర్శి గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ శాఖల పాత్రపై నిర్వహించే సమీక్ష సమావేశంలో వారు పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటల తరువాత పలు ప్రభుత్వ, గిరిజన సంక్షేమ వసతి గృహాలు, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాలలను సందర్శిస్తారు.

సీవోపీ రెన్యువల్ నిబంధనలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రస్తుతం ఉన్న సీవోపీ (సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్)ను న్యాయవాదులు రెన్యువల్ చేయించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లారి ఈశ్వరరావు తెలిపారు. సీవోపీ రెన్యువల్ గురించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, ఇతర అంశాలపై న్యాయవాదులకు అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. సీవోపీ రెన్యువల్, అప్‌లోడ్ చేయడం, ఉండాల్సిన ధ్రువపత్రాలపై బీసీ న్యాయవాదులు సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కార్యదర్శి ప్రసన్న, మాజీ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, న్యాయవాదులు కూన అన్నంనాయుడు, సనపల హరి విజయకుమార్, ప్రతాప్, రాజేంద్ర ఉన్నారు.

నగరాల పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు

శ్రీకాకుళం కల్చరల్: ఇటీవల వచ్చిన పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్స పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన జిల్లాలోని నిరుపేద నగరాల విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తున్నట్లు జిల్లా నగరాల సంఘం అధ్యక్ష, కార్యదర్శిలు నల్లాన ప్రభాకరరావు, పండు రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్‌లో ఆరుగురు విద్యార్థులకు, పదో తరగతిలో ముగ్గురికి బహుమతులు అందిస్తారన్నారు. అర్హత గల ప్రతిభావంతులు వారు సాధించిన మార్కుల వివరాలను 9440195005 నంబర్‌కు వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయాలని కోరారు. ఈ నెల 30 తేదీ లోగా వివరాలు పంపించాలని సూచించారు.

టీడీపీది బూటకపు మేనిఫెస్టో

- సీఎం పదవి కోసం రూ.10వేల కోట్లు ఖర్చు పెట్టిన చంద్రబాబు
- బీఎస్పీ తెలుగు రాష్ట్రాల కో-ఆర్డినేటర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జె.పూర్ణచంద్రరావు



టీడీపీ మేనిఫెస్టో ఓ బూటకమని ప్రతిని చూపిస్తున్న పూర్ణచంద్రరావు

శ్రీకాకుళం క్రైమ్: తెలుగుదేశం పార్టీ బూటకపు మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిందని బహుజన సమాజ్ పార్టీ తెలుగు రాష్ట్రాల కో-ఆర్డినేటర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జె.పూర్ణచంద్రరావు చెప్పారు. శ్రీకాకుళం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగిన వాయిస్ ఆఫ్ ది ఓటర్ (రాజకీయ, సామాజిక చైతన్య సంస్థ) ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ కులాలు, వర్గాలవారితో పలు అంశాలపై పూర్ణచంద్రరావు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు తమ ఆత్మగౌరవాన్ని రక్షించుకోవాలంటే రాజకీయ అవగాహన, ఆచరణే శరణ్యమని, బీఎస్పీతోనే అది సాధ్యమని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీతో పొత్తు కోసం అమిత్‌షా, రాజ్‌నాథ్ వద్ద చంద్రబాబు మూడు రోజులు పడిగాపులు కాసి, అధికార యంత్రాంగాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవడానికి రూ.10వేల కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. టీడీపీ మేనిఫెస్టోలో జనాభా తక్కువ ఉన్న కులాలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని పేర్కొన్నారని, అసలు బీసీల ఓట్లతో లబ్ధిపొంది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కులగణన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కొన్ని నియోజకవర్గాల్లో అధిక ఓట్ల శాతం ఉన్న కులాలను పక్కనపెట్టి స్థానికేతరులకు సీట్లు ఇచ్చి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చేశారని తెలిపారు. భీమిలిలో 50శాతం ఉన్న నాగవంశ కులస్థులను కాదని గంటా శ్రీనివాసరావుకు, ఎచ్చెర్లలో సొండి కులస్థులను పక్కనపెట్టి బీజేపీ ఎమ్మెల్యే ఈశ్వరరావుకు, అనకాపల్లి సీఎం రమేష్ సీట్లు ఇవ్వడం ఇందుకు నిదర్శనమని వివరించారు. కులగణన చేయకపోవడం వల్లే ఈ విధంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు నల్లి ధర్మారావు, సీనియర్ న్యాయవాది పాలిశెట్టి మురళీకృష్ణ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి ,రాష్ట్ర కోశాధికారి కాకి ప్రసాద్, తెలంగ సామాజిక ఉత్తరాంధ్ర అధ్యక్షులు ఆర్.సూర్యప్రకాష్, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు డాక్టర్ అరవింద్, విశ్వ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయల రాము, కార్మిక సంఘ నాయకులు టి.తిరుపతిరావు, ఆదివాసి సైకత శిల్పి గేదెల హరికృష్ణ, నాగవంశ సంఘ నగర అధ్యక్షులు ఎం.వి.మల్లేశ్వరరావు, ముస్లీం మైనార్టీ నాయకుడు మహాబుల్లాఖాన్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్. ప్రొఫెసర్ విష్ణుమూర్తి, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, ప్రొఫెసర్ టి.విష్ణుమూర్తి, బీఎస్పీ జిల్లా కన్వీనరు ఎల్ గరికివాడు, రిటైర్డ్ మెజిస్ట్రేట్ శ్యామ్, లైన్స్ సెంట్రల్ ప్రతినిధి నటుకుల మోహన్, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, డాక్టర్లు, ఇంజినీర్లు సంఘ నాయకులు పాల్గొన్నారు.

మహోన్నత శక్తిగా 'రెడ్‌క్రాస్'



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో రెడ్‌క్రాస్ మహోన్నత శక్తిగా ఎదిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా రక్తదాన శిబిరాలు, నేత్ర సేకరణ, ఉచితవైద్యం, మెడిసిన్ బ్యాంకు ద్వారా ఉచితంగా మందులు అందించడం, ఉచిత అంబులెన్సు సర్వీసు, పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు వార్షిక నివేదికను చదివి వినిపించారు. సేవా కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను జేసీ ప్రారంభించారు. రక్తదాతలు, ఇతర ప్రతినిధులను సత్కరించారు. అనంతరం జేసీ, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావులను సన్మానించారు. ఈ సందర్భంగా శివశ్రీ నృత్య నికేతన్ దర్శకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, కూన ప్రమీల, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి చెన్నకేశ్వరరావు, పి.రజనీకాంతరావు, పి.చైతన్య కుమార్, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వానా వానా వందనం



వాన దేవుడు కరుణించాడు. శ్రీకాకుళం నగరాన్ని తడిపి ప్రజలకు ఉపశమనాన్ని కల్పించాడు. గురువారం తెల్లవారుజాము నుంచి మోస్తరు వర్షం కురిసింది. వర్షంలోనే ప్రజలు తమ కార్యకలాపాలను కొనసాగించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు రైన్ కోట్లను వేసుకున్నారు. ఆ చిత్రాలే ఇవి.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





సంక్షిప్తంగా..

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణం రూ. 20,000 పెట్టుబడిసాయం రైతులకు అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు గురువారం చిలకపాలెం గ్రామ సచివాలయం వద్ద నిరసన చేపట్టి గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తోనంగి నందివాడు, కోరాడ అప్పన్న, పుట్టా కైలాస్ పాల్గొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్య అందించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌ను గురువారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న భవనాలు పరిశీలించి, పాలనపరమైన అంశాలు, సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యను అందించాలని, శాతశాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా పని చేయాలని వివరించారు. డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్ కృష్ణ, కూటమి నాయకులు చౌదిరి నారాయణమూర్తి, బెండు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అరసవల్లిలో విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి:అరసవల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా దీని పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు గురువారం తెలిపారు. అరసవల్లి ప్రాంతం, కాజీపేట, 80 ఫీట్ రోడ్డు, కొత్తపేట, కలెక్టరేట్, బాదుర్లపేట, మహలక్ష్మీనగర్, ఆదిత్యానగర్ కాలనీ, లక్ష్మీనగర్, ఎల్.బి.ఎస్.కాలనీ, కుసుకుపేట, కిల్లిపాలెం, చిన్నమండల వీధి, మధురానగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.


ఎచ్చెర్ల మండలంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం సబ్ డివిజన్ ఏడీఈ ఎస్.భయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎచ్చెర్ల హెడ్ క్వార్టర్, ఎచ్చెర్ల పంచాయతీ, ఎస్ఎంపురం పంచాయతీలోని అనతిమిత్ర టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

జి.సిగడాం మండలంలో..

జి.సిగడాం: మండలంలోని పలుచోట్ల శుక్రవారం విద్యుత్ మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించటం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పున్నాం, యల్లయ్యపేట, ఉల్లివలస, డీఆర్‌వలస, సర్వేశ్వరపురం, ముషినివలస, రౌతుపేట, ముక్కుపేట తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు



ఎచ్చెర్ల సమీపంలోని సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండంలోని 16వ నంబర్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న సర్వీస్ రహదారులపై చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు నిలిచిపోతుంది. నవభారత్, కింతలిమిల్లు, కేశవరావుపేట, ఎచ్చెర్ల, చిలకపాలెం ప్రాంతాల్లో రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉంటుంది. పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు నీరు తుల్లి ద్విచక్ర వాహన చోదకులు తడిసి ముద్దవుతున్నారు. నిర్మాణంలో డిజైన్ లోపం, డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవటంతో వర్షం నీరు నిలిచిపోవటానికి ప్రాధాన కారణంగా ఉంది.